# ఒక పతివ్రత

కొడవటిగంటి కుటుంబరావు



ఇది నాజీవితంలో విపరీత మైన సంఘటన. ఇందులో నాతప్పేమీ లేక పోయినప్పటికీ, ఇది నా జీవితానికి కళంకం తెచ్చింది. ఇది జరిగి ఇప్పటికి పది సంవత్సరా లయింది; దీని ఫలితం ఇంకా నన్ను వెంటాడి, నాకు నిద్రాహారా లందూ ఇతర ఐహికవాంఛలందూ విముఖత్వం కలిగిస్తున్నది. అన్నిటి కన్నా నన్ను బాధిస్తున్నది స్త్రీ వైముఖ్యం. నన్ను ప్రకృతి బ్రహ్మచర్యానికి నిర్దేశించ లేదు. కాని ఇంతకాలం నించీ చేస్తున్న పనే అది. దాపరికం ఎందుకు? నేను ఆడదాన్ని చూసి పూర్తిగా బెదిరిపోయి నాను! నా బెదురు పోగొట్టగల స్త్రీజాతి లేకపోలేదు; కాని ఆసందుల్లో అడుగు పెట్టటానికైనా నాకునైతిక మైన గుండె నిబ్బరంలేదు. నేనట్లా పుట్టలేదు.

ఈ అనుభవం పగవాడి కైనా వద్దు!

నేనిది మొదటి సారి కాదు రాయ బూనటం. బిడి యంవిడిచి నా సంగతి నేను రాసుకోగలగటానికి శక్తి ఇచ్చాడు కాడు భగవంతుడు. అట్లారాసి సంతోషించే మన స్తత్వం ఆ భావకవులకే అవగతం కావాలి. కాని జరిగిందంతా ఒక్కసారి లోకానికి వెల్లడిచేస్తే నా మనస్సు చాలా తేలి కవుతుందని అంతరాత్మ చెబు తున్నది. చేస్తున్నాను నా పదమూడో

ప్రయత్నం। తగిన మనోబలం ఇవ్వమని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను

నేనింకా బాల్యదశలో ఉండగానే, నాకింకా పాతివ్రత్య మంటే ఏమిటో తెలీక మునుపే, నాభార్య పతివ్రత కాబోతుందని ఎరుగుదును. నా జాతకం రాసినాయన ఆముక్క రాశాడు। అప్పటి కింకా పుట్టని పిల్ల నప్పుడే పవిత్రంగా భావించుకోటం మొదలుపెట్టాను।

మానాన్న చేసిన అపాత్రప్పనుల్లో నా వివాహం ఒకటి. అతి స్వల్ప విషయాల కోసం ఉభయ పార్టీలవారూ అతిదారుణంగా దెబ్బలాడుకున్నారు, అప్పటికి మా నాన్న ఇంచుమించుగా నాకు రెట్టింపు వయసువాడు. మా మామగారు నాకు మూడింతల వయసూ. పదింతల అనుభవమూ కలవాడు. అనుభవం వల్ల కూడా అజ్ఞానమూ, అవివేకమూ నశించ వేమో ననుకున్నాను.

ఈ తగాదాలు వైరంగా పరిణమించి నా మనసును ఆందోళనపెట్టినై. వివాహానంతరం ఆరెండు మూడు సంవత్సరాల కాలం ఊచ్చట్లూ ముచ్చట్లూ లేకుండా పోవటమే కాక, నాపతివ్రతను నేను ఏపండగమిషమీదనో చూసుకోటం లేకపోగా, ఆ రెండు మూడు సంవత్సరాల గడువును అతీ గతీ లేకుండా పొయ్యేటట్టూ, నే నేదైనా తెగబడిచేసే దాకా, నలుగు రయినవాళ్ళకూ ఎదురు తిరిగేదాకా నాకూ నాభార్యకూ ఎడబాటు తప్పనట్టూ కనిపించింది. పూర్వమల్లే నే ఇక ముందు కూడా నలుగురిచేతా బుద్ధిమంతు డనిపించుకోవాలంటే చచ్చు వెధవగా ఉండటం కూడా తప్పదని కూడా తేలిపోయింది. ఈ విధంగా నా అభిప్రాయాలు మారిపోతున్నప్పటికీ, ఆదివరకు మంచిగా కనబడ్డదిప్పుడు చెడుగా నిర్ధారణ అవుతున్నప్పటికీ నా ప్రవర్తనలో ఎటువంటి మార్పూ చేసుకో లేకపోయిన అసమర్థుణ్ణి నేను. అదే పనిగా పెట్టుకుని ఇంతకాలం నించీ నావంటి అసమర్థులను ప్రతిరోజూ లెక్క లేనంతమందిని కనిపెడుతున్నాను మన సంఘం యావత్తూ నావంటి అసమర్థులతో నిండినట్టు కనిపిస్తుంది. మన అభిప్రాయాలకు అనుగుణ్యంగా ప్రవర్తన మార్చుకుని అసమర్థత దులిపేసుకోటం మాటలతో సులభంగానే అవుతుంది. కాని ఆచరణలో పెట్టటానికి ఎంతో బుద్ధిబలమూ, ఆత్మగౌరవమూ కావాలి. అంతే, చెప్పటానికీ చెయ్యటానికీ భేదం. చెప్పటం బాగా చాతయినవాళ్ళు ఏకారణంవల్లనో బుద్ధిబలానికి ఆత్మగౌరవానికీ ప్రాముఖ్యం ఇవ్వకుండా ఉంటున్నారు. బాగా ఆలోచించగా మన జాతి వెనకబడి ఉండటం ఇతరజాతుల కన్న మనం తక్కువ తెలుసుకున్న వాళ్ళం కావటం కాదని తోస్తున్నది. మన జాతికి ముఖ్యంగా ఆత్మగౌరవం ఏనాడు పూర్తిగా కలుగుతుందో ఆనాడు మనం

ఇతరజాతు లన్నిటినీ మించి ముందు పోతాం. అంతదాకా మనకు కావలసిన వాళ్ళు చెప్పగలవాళ్ళు కానే కాదు; చెయ్య గలవాళ్లు! ఈలోపుగా మన సారస్వతం ఎంత అభివృద్ధి చేసుకున్నా అది ఇతర జాతుల మెప్పు సంపాదిస్తుంది కాని మన కేమీ ఉపకరించదు!

నాకు పార్వతీశంతో పరిచయం కలిగింది గుంటూరులో. నా కక్కడ తాలూకా ఆఫీసులో ఆరునెల్లు ఆక్టింగ్ గుమాస్తాగిరి ఒక పెద్దమనిషి సిఫారసు మూలాన లభించింది. ఆఫీసుకూ, హోటలుకూ కూడా దగ్గరలోనే ఉండే టట్టు అరండల్ పేట పోస్టాఫీసు చుట్టు పక్కల గదికోసం వెతకటం ప్రారంభించాను. నాకు నచ్చిన గది ఒకటి కనబడ్డది. గది చాలా విశాలంగా ఉండటమే కాక అద్దె నాలుగు రూపాయలే కావటం ఒకటీ, ఇంట్లో ఒక వృద్ధురాలూ ఆవిడ కుమారుడూ (కాలేజీలో చదువు కుంటున్నా డప్పుడు) మాత్రమే ఉండటం వల్ల బావికీ దొడ్డికీ స్వేచ్ఛగా వెళ్లుతుండటానికి ఆటంకం లేకపోవటం ఒకటీ, గది వాకిలి ఇంటివారితో సంబంధం లేకుండా వీధి మీదికి ఉండటం ఒకటీ నాకు చాలా తృప్తికరంగా ఉన్నై. కాని ఇంటావిడ ఒక కండిషను పెట్టింది.

"రేపు ఉదయం ఏమాటా చెబుతా న్నాయనా! పది పన్నెండు రోజుల కింద ఇంకో అబ్బాయివచ్చి ఈరోజు సాయంతరం లోపలే ఏమాటా చెబు తాను; అంత దాకా ఎవడికి మాట ఇవ్వ వద్దని చాలా చాలా చెప్పి పోయినాడు. మళ్ళీ కనిపించలేదు. బహుశా రాడనే తోస్తుంది. మరి ఈగడువులోపల నీకెట్లా మాట ఇవ్వను?" అన్న దావిడ.

"సరే లెండి! ఫరవాలేదు!" అని నేను నిశ్చింతంగా వెళ్ళిపోయినాను. ఆ కుర్రవాడు మళ్ళీ రావచ్చాడా అని నాధైర్యం. మర్నాడు నేను వెళ్ళే టప్పటికి గది ఆక్రమించబడి ఉంది!

నాకు పూర్తిగా ఆశాభంగమయింది. ప్లాటుఫారంమీద అడుగు పెడుతూండగా రైలు సాగిపోయినవాడు పోతున్న రైలు వంక నిరర్థకంగా చూస్తూ నిలబడ్డట్టు నేను నిష్ప్రయోజనంగా కొంచెంసేపు ఆ గదిముందు తారట్లాడాను. ఇంతలో అతను నన్ను చూసి లోపలికి ఆహ్వానించి సంభాషణలోదించి జరిగిందంతా తెలుసు కున్నాడు. ఆకాస్త సంభాషణలోనే నా కతని మీద మంచి అభిప్రాయం ఏర్పడ్డది. మొదటి సంగతి అతను స్నేహపాత్రుడు. ఎక్కడికి పోయినా ఎక్కువ ప్రయత్నం అవసరం లేకుండా గౌరవం పొందగలవాడల్లే కనిపించాడు. అతని వయస్సు అప్పటికి ఇరవై రెండు దాటి ఉండదు. నాకంటె రెండు సంవత్సరాలు పెద్ద. అంతే! అయినా అతనిముందు నాకు నేనే వృద్ధుణ్ణనిపించాను. అతను ఆరోగ్యంతోనూ బలం

తోనూ పొంగిపోతున్నాడు. అతని మెడ చాలా బలిష్టంగా ఉంది. అతను వేసుకున్న మల్లులాల్చీ అతని దండలనూ ఛాతిని దాచలేకుండా ఉందన్నమాట. అతని నడుము ఇరవై నాలు గంగుళాలు మించి ఉండదు. అస లిన్ని బాహ్య లక్షణాలు వర్ణించటం అనవసరం. ఇద్దరు మనుష్యులకు పరస్పరాకర్షణ కలగ టానికి భాషాతీతమైన విషయా లనేకం ఉంటై.

ఒక్క నిమిషం లోపలే మా సంభా షణ అయిపోయింది. పైన మరో అర నిమిషం అనవసరంగా కూర్చుని ఒక నిట్టూర్పు విడిచి లేచాను. గది వెతుక్కో వలసిన పని అట్టే ఉంది మరి. నేను కాళ్ళీడ్చుకుంటూ గుమ్మందాకా పోయిన తరవాత అతను నన్ను పిలిచి అనుమా నిస్తూ ఇద్దరం ఒక గదిలో ఉండటం అసంభవ మౌతుందా అన్నాడు. నాకా ఆలోచన తట్టనేలేదూ! లోపల ఉత్సాహం అణుచుకుని ఎందు కవుతుందన్నాను ఒకరి తరవాత ఒకరు లాభాలు కూడా కనిపెట్టాం.

"అద్దె రొండు రెండు రూపాయలే అవుతుందీ!"

"అవును ఒకళ్ళ కొకళ్ళు తోడుగా ఉంటాం!"

"అవును, కంపెనీగా ఉంటాం — ఒంటరిగా బిక్కు బిక్కు మంటూ ఉండే కన్నా!"

"గది ఒకళ్ళకే చాలా ఎక్కువ కూడానూ!"

ఆ సాయంత్రం నేనుకూడా ఆగదిలో ప్రవేశించాను.

పార్వతీశం నాకు కొత్తరకం మనిషి. కొత్త అనుభవం కూడానూ!

అటువంటి మనిషిని నే నంతకు పూర్వంగాని తరవాత కాని చూడలేదు. అతనితో పరిచయం కలుగుతున్న కొద్దీ అతనిలో నా వంటివాడు నేర్చుకోవలసిన విషయాలు చాలా కనపడ్డై. ఈ విధంగా అతని మీద నా కభిమానం ఎక్కు వవు తూండగా అతన్ని గురించి దారుణమైన సంగతి తెలిసింది. తెలిసిం దేమిటి? అతనే చెప్పాడు — తనకు చుట్టుపక్కల నలుగు రైదుగు రాడవాళ్ళతో ఇలాకా ఉందని!

నే నంతకు పూర్వం వ్యభిచారం చాలా చెడ్డదనే నమ్మకంతో ఉండి, అంత చెడ్డది కాకపోవచ్చును. దేశకాల పాత్రాలను బట్టి అని అనుమానమైనా లేకపోవటంవల్ల, దాన్ని గురించి ఆలో చించిన పాపాన పోయిన వాణ్ణి కాను. ఇప్పుడిక తప్పకపోయింది. ఎందుచే తంటే, నేను త్వరగా అభిప్రాయం మార్చుకునేవాణ్ణి కాను మరి. రంకుతనం చెడ్డదనే అభిప్రాయం మార్చుకోటం ఎంత ఇష్టంలేదో, అతను పెద్ద మనిషి అన్న అభిప్రాయం మార్చుకోట అంత కన్న ఇష్టంలేదు. నిజం విచారిస్తే



మొదటి అభిప్రాయం నాది కాదు, రెండోది నా సొంతం. ఆత్మగౌరవాన్ని గురించి ఉపన్యాసం ఇన్నిసార్లు నాకు నేనే ఇచ్చుకున్న నేను ఇంత స్వల్ప విషయంలోనే దా న్నెందుకు పోగొట్టుకో వాలి? నాది కాని అభిప్రాయంమీద గౌరవంచేత నాసొంత అభిప్రాయాన్ని ఎందుకు మార్చుకోవా లనిపించింది.

ఆలోచించగా ఆలోచించగా రంకు తనానికి మూడభ్యంతరాలు కనబడినై. ఒకటి, రంకుతనం అవినీతి అందుచేత ఆపనిచేసే పురుషుడి భార్య మనస్సూ స్త్రీ, భర్త మనస్సు, వ్యధపొందుతై. దానికి తగిన కారణం ఉన్నా లేక పోయినా, వ్యధపొందటం నిజమే కనక అవినీతి అనటానికి సందేహం లేదు.


రెండు. రంకుతనం వల్ల ఒకరు కన్న పిల్లలు మరొకరి పాల పడటానికి కవకాశం ఉంది. ఇది ఆలోచించిన కొద్దీ దారుణంగా కనబడ్డది. మూడు. ఒకరి నించి మరొకరికి వ్యాధులూ అవీ పంపకం కావటం. దాన్ని గురించి ఆలోచించ బుద్ధయినా పుట్టలేదు. పార్వతీశాన్ని వాదనలోకి దింపితే ఈ మూడు కారణాలూ ఎట్లా తోసేస్తాడో అర్థం కాలేదు. అంత వరకూ అతని పెద్దమనిషితనానికి భంగం కలుగుతున్న దనే భావించవలిసొచ్చింది తప్పని సరిగా.

కాని తీరా ఈ విషయం తెచ్చింతరవాత పార్వతీశం నాకు ఊపిరి తిరగకుండా మాట్లాడాడు.

"ఒకరకం స్త్రీ పురుషసంయోగం తీసుకుని అదే రంకుతన మని నమ్ముతున్నావు! నే నది అంగీకరించను. యాభై యేళ్ళవాడు మూడోపెళ్ళి చేసుకుని ఆపిల్ల ఇష్టాయిష్టాలు విచారించకుండా ఆవిడతో సంసారసుఖం ఏ రంకుతనం కన్నా ఘోరంగా కనిపిస్తుంది నాకు. అది చెరచటమే నంటాను. అది నీతయితే నే నాచరించేది అంతకన్నా వెయ్యిరెట్లు ధర్మం. నా రంకుతనంలో— నువ్వన్న మాటే అంగీకరిస్తాను— అనేక భార్యాభర్తల కలయికల్లో లేని సౌందర్యం ఉంది. నాకు స్త్రీ అవసరం లేందీ ఇల్లు బయులుదేరను. అప్పుడు కూడా నాకోసం కనిపెట్టుకుని ఉన్న ఆడదాని దగ్గరకే పోతాను. నా రంకుతనంలో కక్కుర్తిలేదు. నాలో వెర్రి లేదు. నాసుఖం వెంట పశ్చాత్తాపం గాని, అసూయగాని, ఏ ఇతరమనో జాడ్యం గాని లేదు. మనస్సుకు కాని శరీరానికి కాని జబ్బు చెయ్యని ఆనందం. దాన్లో ప్రేమ కూడా ఉంది. ఒక్క భార్య ఎదురుగా కూర్చుని ప్రేమ ఎక్కడుంది అని తల పగిలేటట్టు ఆలోచించేవాడికన్న నే నెంత నయం! నన్ను ప్రేమ అనేక రూపాలతో ఎదుర్కొంటుంది!

"నువ్వు చెప్పే నీతి ఆడదాన్నీ మగవాణ్ణీ ఆజన్మాంతం కట్టేసి చెప్పరాని బాధ తెస్తుంది. ఏ స్త్రీని ఎప్పుడు వదిలెయ్యాలో నాకుతెలుసు. నీకు భయంకరంగా ఉంటుంది. కాని మా ఇద్దరికీ మంచిదని తెలిసినప్పుడే నే నటువంటి పనిచేస్తాను.

"అదీ కాకుండా ఈవిషయం నీతి యావత్తూ విశదంగా తెలుసుకునే దాకా ఇది నీతి ఇది కాదని చెప్పరాదు. రోగాలున్న వాడి భార్య వాడితో కాపరం చెయ్యక పోవడం నీతా కాదా? నువ్వాలోచించ లేదు! స్త్రీ పురుషులు అన్యోన్యంగా ప్రేమించుకుని మూడో కంటివాడికి తెలీకుండా రంకుతనం చెయ్యటం నీతా కాదా? ఆలోచించలేదు! రహస్యంగా పిల్లలను కని ఇంకోరి భారంమీద వదిలిపెట్టటం నీతి కాదు! సరే, మూడు




జన్మల దరిద్రుడు సాలుకో పిల్లను కనటం నీతా అవినీతా? ఆలోచించ లేదు!

"నువ్వు ఒక్క విషయం ఆలోచించ లేదోయి! నీతి ఒక్కడివల్ల ఆచరణ లోకి వచ్చేది కాదు. అది సంఘంమీద ప్రసరించి నాగరికతనూ, సంఘాన్నీ వృద్ధి చెయ్యాలి. ఈలోపల నేను రోగాలు తగలకుండా, నావల్ల యితరులకు గర్భాలు రాకుండా నా చాతనైన జాగ్రత్త పడటం లేదనుకోకు!"

"ఇదంతా నాకు పట్టలేదు. నాకల్లా ఒక్కటే దిగులు! ఈనాటివరకూ నాకు దొరికే ఆడవాళ్ళ విషయంలో నేను పొరపాటు పడటంలేదు. మరేం లేదు. తాత్కాలికంగా కలుసుకున్న కాస్సేపూ అవతల మనిషికి నామీద పూర్తయిన ప్రేమ ఉండాలి, అటువంటి మనిషి కాదని మొదటి చూపులోనే తోచిందా ఆవిడ రంభ గానీ, తిరిగి అటు చూడను. ఇంతవరకూ నా ఇన్‌స్టింక్ట్ సరిగానే పని చేస్తున్నది. పొరపాటున నా మీద ఇష్టం లేని మనిషిని సమీపించి ఒకసారి చివాట్లు పడ్డాననుకో! ఇక నన్ను నేను క్షమించుకోగలనా? తరవాత ఆత్మహత్య చేసుకోటం తప్ప గతిలేదు. నాకంత

అభిమానం ఉంది. ఇంతవరకటువంటి పరాభవం జరలేదు. ఏ క్షణం జరిగినా జరగవచ్చును ! ఒకడు నా చెయ్యి చూసి నిన్ను స్త్రీ మోసగిస్తుం దని చెప్పాడు. తనకు పామిస్ట్రీ బాగా రాదని కూడా ఒప్పుకున్నాడు. కాని నన్నా మాట మధ్య మధ్య బాధిస్తూంటుంది, బ్రదర్ !"

నే నతని ధోరణికి దిగ్భ్రమ చెందాను. ఇటువంటి ఉపన్యాసం నే నెన్నడూ వినలేదు.


"అయితే ప్రేమను గురించి నీ అభి ప్రాయం లోకాభిప్రాయానికి భిన్నంగా ఉన్నట్టు కనిపిస్తుందే?" అన్నాను.

"లోకం ఊహించుకునే ప్రేమ పద్యా లల్లటానికీ, రైల్వే నవలలు రాయటానికీ మాత్రమే పనికొస్తుంది. నేను ప్రేమ అనేది నా అపరిపూర్ణత్వానికి పరిపూర్ణ మైనది. అది ఎక్కువ భాగం శరీర సంబంధ మైనది. నాతో సంబంధ మున్న ఆడవాళ్ళను గురించి నేను పూర్తిగా తెలుసుకోను. తెలుసుకున్న ఉత్తరక్షణం ప్రేమ పలాయనం అవుతుంది. ఈ తెలుసు కోవటం మనిషి లోపాలకే కాక ఒక్కొక సారి మంచి గుణాల కూడా వర్తిస్తుంది. ఒకప్పుడు నాతో సంబంధం గల అమ్మాయి నా ఎదట తన అవినీతిని దూషించుకుంది. వెంటనే నేను ఆమెను వదిలిపెట్టి వచ్చేశాను. నా కామెను చూస్తే కోపం రాలేదు. కాని ఇక మా ఇద్దరికీ తాత్కాలికంగా నైనా పరిపూర్ణ మైన ప్రేమ కలగదని నే నెరుగుదును!"

ఉత్త ఉపన్యాసం వినటం అట్టే కష్ట మనిపించలేదు. కాని, రంకు పురాణం ఎత్తగానే నాకు వికారం ప్రారంభమైంది. నా మొహంలో అత నేదో మార్పు గ్రహించి ఉండాలి; వెంటనే విషయం మార్చాడు.

"మరో ముఖ్య మైన విషయం," అన్నాడతను. "అనేకమంది ఈ విష యంలో శీలవంతు లనిపించుకునే వాళ్ళు తమ శీలాన్ని స్త్రీ సంపర్కమనేది జీవి తంలో లేకుండా చేసుకుని ఆడదానికి మైలు దూరంలో నైనా ఉండక దక్కించు కుంటారు. వాళ్ళకు మాతృత్వం ఏమిటో ఎన్నటికైనా తెలుస్తుందా? అసంభవం. నేను నా తల్లి మాదిరిగా ప్రేమించగల స్త్రీ కనీసం ఒకతె ఉంది. నా కన్న రెండేళ్ళు చిన్నది. నమ్ముతావా! ఆవిడ నామనస్సును పైనుంచి కిందికి చదవ గలదు. నా మంచి చెడ్డలు ఆవిడ దగ్గిర దాచలేను. ఆవిడ నాకన్న ఎంతో అబల. ఆవిడ దగ్గిర ఉంటే నాకు కొండ ఉన్న ట్టుంటుంది! మనస్సుకు ఆందోళన కలిగి నప్పుడల్లా వెళ్ళి వాళ్ళింటో పదిరోజు లుండి వస్తుంటాను!"

ఈ విషయమై అతని దగ్గిర మళ్ళీ సంభాషణ తేలేదు నేను. అతను చెప్పిన ముక్కలు హరించుకుంటూ చాలా రోజులు గడిపాను.




నా ఉద్యోగం ఇంకా నెలరోజులతో ఆఖరవుతుందనగా జరిగిందా ఘోరం!

ఆ రోజుల్లో పార్వతీశంలో మార్పు గ్రహించాను. అతను యధాప్రకారం వారానికోరాత్రి ఇల్లు వదిలిపోవటం మానుకున్నాడు. దానికి బదులు ప్రతి రోజూ సూర్యాస్తమయం వేళ ఎక్కడికో వెళ్ళి దీపాలు పెట్టగానే రావటం మొదలు పెట్టాడు.

ఒకరోజు అత నింటికి రాగానే "కొత్తపద్దా?" అని అడిగాను.

అతను కాస్సేపు నావైపు పరధ్యానంగా చూసి "నాలో ముసలివాడి లక్షణాలు కనిపిస్తున్నయ్యా?" అని అడిగాడు.

ఏమల్లా అడుగుతున్నా వన్నాను.

"మరేం లేదు. కొంచెం ఉటోపియనయిపోతున్నానేమో అని భయం వేస్తున్నది. అది తప్పకుండా వార్ధక్య లక్షణమే!"

"ఏం?"

"ఎవరో పిల్లను చూసి నాకీ పిల్ల లభిస్తే ప్రపంచమే అక్కర్లేదనుకోటాన్నేమంటావు? నాకిటువంటిదింత వరకూ ఎన్నడూ జరగలేదు."

"ఇప్పుడు జరిగిందా?"

అతను కాస్సేపు గంభీరంగా ఉన్నాడు. కాని చూస్తూండగానే అతనిలో నే నెన్నడూ గమనించని ఉద్రేకం వచ్చింది. "ఆ పిల్లకోసం గుండె కోసేసుకుంటానోయి! నాకు ముసలితనం లేదూ ఏమీలేదూ! ఆపిల్ల నాభార్య అయి ఉంటే నేను పరస్త్రీ వంక చూడక పోయి ఉందును! ఛీ! ఏం బతుకిది?... (నవ్వుతూ) కీచకుడికి ద్రౌపదిని చూడగానే ఇట్లాగే అనిపించిందేమో?"

నేను అప్రయత్నంగా "అదేం పోలిక?" అన్నాను.

ఆ తరవాత ప్రతిరోజూ అతనిలో మార్పు గమనిస్తూ వచ్చాను. ఒకరోజు ఉత్సాహంగా పొంగి పోతూండేవాడు, ఒకరోజు పలకరిస్తే కళ్ళనీళ్ళ పర్యంతం అయేటట్టుండేవాడు. "స్త్రీ వ్యసనమయింది. ఉన్మాదం తలకెక్కింది!" అనుకున్నాను. అతన్ని ఏవిధమైన ప్రశ్నలూ వెయ్యలేదు నేను.

గురువారం నాడు సాయంకాలం అతను నాతో "ఇది దుర్భరం అవుతున్నది, మా సీతమ్మను చూసి రావాలి?" అని ఇల్లు వదలిపెట్టి పోయినాడు. ఆ రాత్రి అతను అమిత సంతోషంగా ఉన్నాడు — పెన్నిధి దొరికినవాడల్లే! అమాటే అడిగాను. దొరకనే దొరికిందన్నాడు.

మర్నాడు సాయంకాలం అతను వెళ్ళిన పావుగంటకే తిరిగి వచ్చాడు. అతని ఆనందం వర్ణనాతీతం!

ఆరాత్రి అతను పెళ్ళికొడుకల్లే ముస్తాబయినాడు. గడియారం చూసుకుంటూ కాలు నిలవకనేమో అటూ ఇటూ బోనులో మృగమల్లే పచార్లు చెయ్యటం మొదలుపెట్టిపది కాగానే బోనులోనించివదిలిపెట్టిన ఎలికల్లే బయటికి జారుకున్నాడు.

పదకొండయింది. నాకు నిద్ర పట్టలేదు. అతను వచ్చేవరకూ మేలుకుని ఉండటం మర్యాదగా ఉండదు. నేనతనికి ఉత్సాహభంగం ఏవిధంగానూ కలిగించలేదు అంతవరకూ.అతను వచ్చే వరకూ నేను మేలుకుని ఉండటం కూడా అతని మనస్సుకు కష్టం కలిగించవచ్చును. పదకొండున్నర అయింది. కళ్ళు మండుతున్నా నిద్దర మాత్రం వచ్చేటట్టు లేదు. నా ఆలోచనకు దారీ తెన్నూ లేదు. పన్నెండు!

బయట అడుగుల చప్పుడు. నేను నిద్రలో ఉన్నట్టు పడుకున్నాను.

"ఎవరండీ లోపల?"

"ఎవరది?" అంటూ నేను పక్కమీద లేచి కూర్చున్నాను.''

"నేను డాక్టరుగారి నౌకర్ని. మీ పార్వతీశంగారు బతికేట్టు లేదండి. మిమ్మల్ని డాక్టరుగారు దబ్బున రమ్మన్నారు.

ఈ మానవ ప్రకృతి కొన్ని కొన్ని విషయాల్లో మారదేమో ననిపిస్తుంది.

వాడు స్పష్టంగా పార్వతీశ మని చెబుతూంటే నేను పార్వతీశం కాదని నామనస్సును రెండు నిమిషాలు నమ్మించాను. అప్పుడు ఒక్కసారిగా దడ పుట్టుకొచ్చింది. వణుకుతూ లేచి తలుపు దగ్గిరిగా వేసి వాడి వెంట రొప్పుతూ నడుస్తూ సంగతి కనుక్కున్నాను. బ్రాడీపేటలో గుడికి సమీపంలో ఎవరో పడి



ఉన్నట్టుచూసి పక్కనేఉన్న బండీమీద డాక్టరుగారింటికి చేర్చాడుట ఒక పెద్ద మనిషి. ఎవరో పార్వతీశాన్ని గట్టి కర్రతో వెనకనించి బలంగా కొట్టారు. తల అదుచుకు పోయింది. బతకటం అసంభవం ! నాకు చెమటతో బట్టలు తడిసిపోయినై .

నేను వెళ్ళేటప్పటికి అంతా మించిపోయింది. డాక్టరుగారు కాగితంమీద పార్వతీశం నోటివెంట వచ్చిన మాటలు రాసి పెట్టి చూపించాడు. "అనుకున్నంత పనీ అయింది. బతకటం అనవసరం. మా సీతమ్మను చూస్తే—" ఇంకా ఏమిటో గొణిగాడట. డాక్టరుగారికి స్పష్టంగా తెలీలేదు.

డాక్టరుగారి కుర్రవాడు శవం మీద గుడ్డతీశాడు. ఆదృశ్యం చూడగానే నాకు మూర్ఛ వచ్చేటట్టయింది. కళ్ళలోకి

నీళ్ళు దిగి అదృష్టవశాత్తూ చూపు చెడ్డది. నేను తల పక్కకు తిప్పుకోగానే వాడు మళ్ళీ గుడ్డ కప్పేశాడు.

అంత సాహసం ఎవరు చేశారో తెలీనేలేదు! అర్థం లేకుండా నేను వెర్రి వాడల్లే గుడిచుట్టూ తారట్లాడటం మొదలు పెట్టాను. ప్రతి సాయంత్రమూ. ఒక రోజున ఎక్కడో చూసినట్టున్న మొహం కనబడ్డది గుళ్ళోకి పోతూ. తరవాత జ్ఞాపకం వచ్చింది నాభార్య! చాలా అందగత్తె అయింది! నా బావమరిది!! తాగుబోతు వెధవ!!

నారక్తం వేడెక్కి వేడి చెవులవెంట కారటం మొదలుపెట్టింది. పార్వతీశం చావుకు పెద్దమనిషల్లే పగతీర్చుకోగలనా?

బయట నాభార్య కోసరం కనిపెట్టుకుని ఉండి తరవాత ఆమెను వాళ్ళింటిదాకా వెంబడించాను. నన్ను చూడగానే నాభార్య మొహం మూడు రంగులు మారింది.

ఎవరూ నన్ను మర్యాద చెయ్యకుండాని నేను లోపలికి పోయి సావిట్లో నాభార్యను రెక్కపట్టి నిలవేశాను,

"నా స్నేహితుణ్ణి చంపించింది నువ్వేనా?"

మాటలేదు. మొహం మరోరంగు మారింది.

"నువ్వతని వంక ప్రేమతో చూడకపోతే అతనంత పరవశుడు కాడు. నీ అన్నతో నువ్వెందుకీవిషయం చెప్పాలిసొచ్చిందీ? అతనే కనుక్కున్నాడా?"

మాటలేదు. కాని నాపట్టు నాకు తెలీకుండానే బిగిసి ఉండాలి. నాభార్య చిన్న కేకపెట్టి చెయ్యి వదిలించుకోవాలని చూసింది. నేను పట్టు మరింత గట్టిగా పట్టాను.

"అబ్బబ్బ! నన్నడిగా డాయన! అందుకని చెప్పాను! అమ్మమ్మమ్మ!"

"అంత మాత్రానికే నీ పాతివ్రత్యానికి భంగం కలిగిందా? అంత పతివ్రతవు మీవాళ్ళను పాటించకుండా నాదగ్గిరికెందుకు రాలేదు?- అతన్నెందుకు ప్రోత్సహించావు? ఏరకం ప్రోత్సాహం లేకుండా అతను నిన్ను అడిగే స్థితికొచ్చాడా?... నీ మీద పగ తీర్చుకుంటాను! నిన్ను నేను అదివరకు వదలక పోయినా ఇప్పుడు వదిలేస్తున్నాను. నువ్వెక్కడున్నా నేను వెయ్యి కళ్ళతో చూస్తూంటాను. నువ్వేరోజు ఇంకోడితో పోతే ఆరోజు నీకు నాచేతిలో చావు తప్పదు. నిన్ను బహిరంగంగా చిత్రవధ చేస్తాను... మగవాడికి ఇంకో మగవాడి మీద ఎంత ప్రేమ ఉండవచ్చునో అంత ఉంది నాకతనిమీద! మమ్మల్నిద్దర్నీ ధ్వంసం చేశావు ఒక్కదెబ్బతో." నాకళ్ళ వెంట నీళ్ళు కారటం మొదలు పెట్టినై. నేను వెంటనే ఆచోటు వదిలిపెట్టి ఇంటి దారి పట్టాను. దారివెంట నా భుజంమీద చెయ్యి వేసి పార్వతీశం నడుస్తున్నట్టయింది! నావేడి తక్షణం దిగిపోయింది.